సాక్షి రంగారెడ్డి

గురువారం • 31 • ఆగస్టు • 2023



షాద్‌నగర్ వేదికగా..

బడుగుబలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ అన్నారు. 8లో ▸



క్రీడలతోనూ ఉజ్వల భవిష్యత్

క్రీడలతోనూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. 8లో ▸



మంపు లేకుండా చూడాలి

జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ బుధవారం సమీక్ష నిర్వహించారు. 8లో ▸

న్యూస్‌రీల్

'అభివృద్ధికి సహకారం అందించండి'



మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల, గనులు, భూగర్భ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పట్నం మహేందర్‌రెడ్డిని బుధవారం సచివాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఆయనవెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, యువజన విభాగం నాయకుడు రాజు ఉన్నారు.

రేపు మహాధర్నా

తుర్కయంజాల్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పీఆర్సీ కమిటీని వేసి వెంటనే ఐఆర్ ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, 317 జీ.ఓ. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

సాగులో అధికారుల సూచనలు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న గీతారెడ్డి

కేశంపేట: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లిలో రైతులు సాగుచేస్తున్న వరి, మొక్కజొన్న, పత్తి పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. పత్తి పంటలో రసంపీల్చే పురుగు, పేనుబంక అధికంగా ఉందని, వరిపంటలో కాండం తొలిచే పురుగు, మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించారు. చీడపురుగుల నివారణకు ఏయే మందులు వాడాలో రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాములు పాల్గొన్నారు.

డిక్లరేషన్ నెరవేరుస్తాం

డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే డిక్లరేషన్లన్నీ నెరవేరుస్తామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఎలక్షన్ల ముందు ఇచ్చిన ఐదు హామీల్లో ఇప్పటికే మూడింటిని అమలు చేస్తోందని తెలిపారు. రైతు డిక్లరేషన్, యువ డిక్లరేషన్, ఎస్సీఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రతి హామీని అమలుచేసి తీరుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అధికార పార్టీతో సహా అన్నిపార్టీలు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని.. ఆ పార్టీ నేతల మాటలను నమ్మవద్దని.. అమలుకానీ హామీలతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఫసల్ బీమాను అమలు చేయండి: బీజేపీ

కేశంపేట: లోటు వర్షపాతం వలన పంట నష్టపోయిన రైతులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేయాలని బీజేపీ సాంస్కృతికశాఖ జిల్లా కోకన్వీనర్ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సంతాపూర్‌లో మొక్కజొన్నపంటను బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని బీఆర్‌ఎస్ సర్కార్ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడం లేదని అన్నారు. ఈ పథకాన్ని అమలుచేసినట్లయితే పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15వేల వరకు బీమా ద్వారా ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించేదని అన్నారు. వెంటనే ఫసల్ బీమా ను రాష్ట్రంలో అమలుచేయాలన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వహ్.. తీజ్





మొలకల బుట్టలతో యువతులు

డీజే మోతలు.. బ్యాండు మేళాలు.. మొలకల బుట్టలు.. యువతుల నృత్యాలు.. నేతల హంగామాతో మైసిగండి కళకళలాడింది. గిరిజనుల సంప్రదాయ పండుగ తీజ్‌ను బుధవారం వైభవంగా జరుపుకొన్నారు. తొమ్మిది రోజులుగా నియమనిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించిన యువతులు, మహిళలు భక్తిశ్రద్ధలతో మొలకల బుట్టలు తయారు చేశారు. వీటిని తలపై పెట్టుకుని బంజారా నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

– కడ్తాల్



తీజ్ ఊరేగింపుతో జనసంద్రంగా మారిన మైసిగండి

ఎడ్లకంచెను ఏంచేద్దాం?

రసాభాసగా తాడిపర్తి భూదాన్ భూముల పరిహారం

- భూములు తమవే అంటూ పరిహారం కాజేసిన అక్రమార్కులు
- రైతుల ఆందోళనతో రీసర్వేకు ఆదేశించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి
- సహకరించిన అధికారుల గుండెల్లో గుబులు



తాడిపర్తి సర్వే నంబరు 104లోని భూదాన్ భూమి

యాచారం: ఫార్మాసిటీ కోసం తాడిపర్తి గ్రామంలో సేకరించిన భూదాన్ భూములకు సంబంధించి పరిహారం చెల్లింపు విషయంలో అధికారుల్లో తర్జనభర్జన నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. యాచారం మండలం తాడిపర్తిలోని సర్వే నంబర్ 104లో 250 ఎకరాల భూదాన్ భూమి ఉంది. ఆచార్య వినోభాబావే నేతృత్వంలో 1954లో జరిగిన భూదానోద్యమంలో తాడిపర్తి గ్రామానికి చెందిన బొక్క సీతారెడ్డి కుటుంబ సభ్యులు సర్వే నంబరు 104లో తమ పేరిట ఉన్న 250 ఎకరాలను సర్వోదయ భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేశారు. అనంతరం రెవెన్యూ శాఖ కొంత భూమిని రికార్డుల్లో నమోదు చేసి పేదలకు పంపిణీ చేసింది. మిగిలిన భూమిని రికార్డుల్లో నమోదు చేసి పర్యవేక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ భూమిని గ్రామస్తులు 'ఎడ్లకంచె'గా పిలిచేవారు. కొంతమంది సాగుచేసుకుని జీవనోపాధి పొందగా..మరికొందరు తమ పాడి, పశువులు, గొర్రెల, మేకల పెంపకానికి ఉపయోగించేవారు. కొంతకాలం తర్వాత పట్టాలు పొందిన రైతులు ఆ భూమిని పట్టించుకోకపోవడంతో ఆ భూమి బీడుగా మారింది. భూముల ధరలు బాగా పెరగడంతో ఈ సర్వే నంబరులోని భూదాన్ భూమిపై అక్రమార్కులు కన్నేశారు. కొంతమంది రెవెన్యూ అధికారుల అండతో దొడ్డిదారిన హక్కు పత్రాలు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భూముల ధరలకు రెక్కలు..

2018లో ఫార్మాసిటీ కోసం యాచారం, కందుకూర్, ఆమన్‌గల్ మండలాల్లో 19,333 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమిని సేకరించాలని సర్కార్ నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈవిషయం తెలుసుకున్న అక్రమార్కులు భూదాన్ భూమిపై పరిహారం పొందాలనే కుట్రలకు తెరతీశారు. అందులో భాగంగానే తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లోని 250 ఎకరాల భూదాన్ భూమికి పరిహారం చెల్లించేలా ఉన్నత స్థాయిలో పైరవీలకు జీవం పోశారు. రెవెన్యూ అధికారుల అండతో.. 250 ఎకరాల్లో 53 ఎకరాల అటవీప్రాంతం ఉందని, 24 ఎకరాల్లో బంధం చెరువు ఉందని, 5 ఎకరాల భూమిని పలు దేవతామూర్తుల దేవాలయాలకు వదిలి, మిగితా 168 ఎకరాల భూమికి ఎకరాకు రూ.16 లక్షల చొప్పున పరిహారం కాజేశారు. సర్వే నంబరు 104లోని భూదాన్ భూమిని ఫార్మాసిటీకి సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్ ద్వారా తెలుసుకున్న రైతులు అక్రమార్కులకు పరిహారం ఇవ్వవద్దని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇవేమీ పట్టించుకోని రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ శాఖల అధికారులు రూ.కోట్లాది నిధులను పరిహారం కింద రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్లాట్ల పంపిణీని అడ్డుకోవడంతో...

సర్వే నంబరు 104లోని 162 ఎకరాల భూదాన్ భూమిని సేకరించి 48 మంది రైతులకు ఫార్మాసిటీ పరిహారం చెల్లించారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 121 గజాల చొప్పున మీరాఖాన్‌పేటలోని 600 ఎకరాల హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ప్లాట్ల పట్టా సర్టిఫికెట్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఈనెల 16న భూదాన్ భూమిపై పరిహారం పొందిన రైతులకు కూడా ప్లాట్ల సర్టిఫికెట్లు ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న తాడిపర్తి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి సర్వే నంబరు 104లోని 250 భూదాన్ భూమిపై హక్కులు సాధించుకోవడానికి ఎన్నో పోరాటాలు చేశాం, 1989లో జైలుకు కూడా పోయాం. మాకు కాదని అధికారులు దొడ్డిదారిన పట్టాలు పొందిన వారికి ఫార్మాసిటీ పరిహారం ఇచ్చారు. నేడు మళ్లీ వారికే ఎలా ఇంటిస్థలాల సర్టిఫికెట్లు ఇస్తారని ఫిర్యాదు చేశారు.

రీసర్వేతో తర్జనభర్జన ..

భూదాన్ భూమిపై రూ.కోట్లాది పరిహారాన్ని అధికారులే అందజేశారు. ఈ నేపథ్యంలో 250 ఎకరాల భూదాన్ భూమిపై గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ఇంటి స్థలాల కోసం అక్రమార్కుల పైరవీలతో ప్రస్తుత అధికారులు 'ఎడ్లకంచె' భూమిపై ఏం చేద్దాం, కబ్జాలో ఉన్న రైతులకు, జైలుకు వెళ్లిన బాధితులకు ఏం సమాధానం చెబుదామని ఆలోచనలో పడ్డారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రెండు, మూడు రోజుల్లో తాడిపర్తి గ్రామంలోని భూదాన్ భూమిపై రీసర్వే చేయడానికి ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి సిద్ధమయ్యారు. సర్వే సమయంలో ఫార్మాసిటీ పరిహారం పొందిన వాళ్లు వస్తారా.. వస్తే గ్రామస్తుల నుంచి తిరుగుబాటు ఎలా ఉండబోతుందనే ఆందోళన అధికారుల్లో నెలకొంది. రూ.కోట్లాది నిధులను అందజేసిన తర్వాత మళ్లీ ఏ విధంగా సేకరించాలనే అంశం కూడా అధికారులను వేధిస్తుంది. ఈ విషయాన్ని ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లి కబ్జాలో ఉన్న రైతులకు న్యాయం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్డీఓ రీసర్వే తర్వాత ఏం జరుగుతుందోననే విషయం ఇప్పుడు ఆసక్తిగా మారింది.

అనర్హులకు పరిహారం



తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లోని 250 ఎకరాల భూదాన్ భూమిపై పేద రైతులకే హక్కులు కల్పించాలని 2020లో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాం. భూదాన్ భూమి సాధనలో ఎంతో మంది జైలుకు కూడా పోయారు. హైకోర్టులో కేసు ఉండగానే రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ అధికారులు..దొడ్డిదారిన పట్టాలు పొందినవారికి రూ.కోట్లాది పరిహారాన్ని అందజేశారు. ఇదెక్కడి న్యాయం.

– బావయ్య, ఎంపీటీసీ, తాడిపర్తి

డబ్బు రికవరీ చేయాలి



సర్వే నంబరు 104లో ఫార్మాసిటీ పరిహారం పొందిన అనర్హుల నుంచి డబ్బులు రికవరీ చేయాలి. అధికారులు గ్రామసభ పెట్టిన రోజే తీవ్రంగా వ్యతిరేకించాం. బాధిత రైతులకే పరిహారంతో పాటు ప్లాట్లు అందజేయాలి. ఎమ్మెల్యే మంచిరెడ్డికి కూడా ఈ విషయాన్ని తెలియజేశాం. పరిహారం అందజేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. అధికారులు తేల్చకపోతే ఆ భూమిని సాగుచేస్తాం.

– రమేష్, సర్పంచ్, తాడిపర్తి

రీసర్వే చేస్తాం



తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లోని 250 ఎకరాల భూదాన్ భూమిపై సమగ్ర విచారణ జరుపుతాం. ఫార్మాసిటీ పరిహారాన్ని ఎలా అందజేశారు అనే వివరాలు సేకరిస్తాం. గ్రామంలోని భూమి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటాం. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీని నిలిపేశాం. అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

2వేల మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు



ఆన్‌లైన్ విధానంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

- ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా లక్కీ డ్రా
- కలెక్టర్ హరీష్, ఎమ్మెల్యేల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక
- విడతల వారీగా అందరికీ ఇళ్లు ఇస్తాం: మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకే సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ హరీష్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన 2 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే సంకల్పంతో ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ వేదికగా లక్కీ డ్రా నిర్వహించారు. ఇందు కోసం 93,899 దరఖాస్తులు రాగా.. 12,479 మందిని అర్హులుగా గుర్తించి.. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 500 మంది చొప్పున సెలెక్ట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల కోసం కొల్లూరులో సకల సౌకర్యాలతో కట్టిన ఇళ్లను సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రారంభించారని తెలిపారు. అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు అందిస్తామని స్పష్టంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఐసీ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన ర్యాండమైజేషన్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించామని స్పష్టంచేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందని స్పష్టంచేశారు. ఇళ్ల కేటాయింపులో ఎలాంటి పైరవీలకు తావు లేదని, దళారులను నమ్మొద్దని మంత్రి సూచించారు. ఆధార్ కార్డు అనుసంధానం చేస్తుండటంతో ఒక వ్యక్తి రెండుసార్లు లబ్ధి పొందే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌దే గెలుపు

మహేశ్వరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పుగడ్డ, కొత్త తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆమె చేతులమీదుగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయన్నారు. కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్‌నాయక్, రమేష్, రాజు, రవి, రమేష్, శివ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్‌నాయక్, సంత్ సేవాలాల్ గుడి చైర్మన్ సీతారామ్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు సేవ్యానాయక్, రాజునాయక్, రవీందర్‌నాయక్, రాజ్‌కుమార్ నాయక్,సురేష్‌నాయక్, దేశ్యానాయక్, శంకర్‌నాయక్, కల్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల



బహుమతులు అందిస్తున్న తాండ్ర విశాల

కేశంపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల అన్నారు. కేశంపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, మహాత్మజ్యోతిరావ్ పూలే పాఠశాల విద్యార్థులతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి టోర్నమెంట్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు బాలికలకు, బాలురకు వేర్వేరుగా నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు చైర్‌పర్సన్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మనోహర్, ప్రధానోపాధ్యాయులు రసూల్,వెంకటయ్య గౌడ్, పీఈటీలు, సర్పంచ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం షాద్‌నగర్ బీజేపీ కార్యాలయంలో కొందుర్గు మండలం పాతఆగిర్యాల గ్రామానికి చెందిన 100 మంది యువకులు నర్సింహారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకుకెళ్దాం అని పిలుపునిచ్చారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డి, మురళీ, వంశీకృష్ణ, మోహన్‌సింగ్, కుర్మయ్య, అశోక్, నర్సింహ, జగదీష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



నర్సింహారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ఎస్‌జీఎఫ్ఐ క్రీడల ప్రారంభోత్సవంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: క్రీడలతోనూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. క్రీడాకారులు ఉన్నతంగా రాణించి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడా ఎంపిక పోటీలకు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సహకారంతో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, తహసీల్దార్ షేక్ ముంతాజ్, ఎంపీడీఓ రామకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంఈఓ సర్దార్‌నాయక్, జోనల్ కార్యదర్శి భీముడు, ఉప సర్పంచ్ రామకృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, గ్రామ అధ్యక్షుడు నర్సింహ, హెచ్‌ఎం జంగయ్య, మార్కెట్ డైరెక్టర్లు లాయక్‌అలీ, రమేశ్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, శ్వేత, మాధురి, శైలజ, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

మంపు లేకుండా చూడాలి

- ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్
- అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ బుధవారం సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎస్.వసంత, డీఈ వెంకన్న, ఏఈ ఆయేషా, మజ్లిస్ కౌన్సిలర్లతో కలిసి ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులపై ఆరా తీశారు. కొత్తమోని కుంట నుంచి గుర్రం చెరువు వరకు, నబీల్ కాలనీలో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ముంపు సమస్య లేకుండా చూడాలన్నారు. ఎస్‌ఎన్‌డీపీ నాలా నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ కౌన్సిలర్లు అహ్మద్ కసాది, జాఫర్ బామ్, కో ఆప్షన్ మెంబర్ ఉస్మాన్ షరీఫ్, నాయకులు దస్తగిర్, హమేద్, యాహ్యా, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్

షాద్‌నగర్ వేదికగా బీసీ డిక్లరేషన్

- బడుగుల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం
- పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మావతి కన్వెన్షన్ హాలులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందన్నారు. ఇప్పటికే రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లు విడుదల చేశామని వివరించారు. షాద్‌నగర్ వేదికగా త్వరలోనే బీసీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించే ఈ సభకు పార్టీ అగ్రనేతలతో పాటుగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య విచ్చేస్తారని చెప్పారు. సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి గద్దె దించుతామని అన్నారు. కేంద్రంలో బీజేపీ దుర్మార్గపు పాలన చేస్తుంటే రాష్ట్రంలో కేసీఆర్ రాక్షసపాలన చేస్తూ ప్రజా ధనాన్ని దోచుకొని దాచుకుంటున్నారని ఆరోపించారు. కర్ణాటక స్ఫూర్తితో తెలంగాణలోనూ విజయం సాధిస్తామన్నారు. దేశం వ్యాప్తంగా ఓబీసీ ప్రకారం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ప్రదీప్, సంజీవ్, యాదయ్యయాదవ్, రఘు, బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చంద్రశేఖర్, రాజు, జంగ నర్సింహ యాదవ్, జగదీశ్వరప్ప, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్

ఏడుగురు మహిళలకు బైండోవర్

యాచారం: నాటు సారాయి తయారీ చేస్తున్న మంతన్‌గౌరెల్లి, తక్కల్లపల్లి తండాకు చెందిన ఏడుగురు మహిళలను బుధవారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సారాయి తయారు చేసే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు.



మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి

సభ్యత్వం లేని వారు అసమ్మతి నేతలా..?



తలకొండపల్లిలో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

- స్థాయి మరచి మాట్లాడడం సరికాదు
- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: బీఆర్‌ఎస్‌లో సభ్యత్వం లేనివారు.. నియోజకవర్గంతో సంబంధం లేని వారు అసమ్మతి నేతలమంటూ సమావేశాలు నిర్వహించడం సరికాదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ నర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై విమర్శలు చేసిన వారంతా ఇతర పార్టీలకు చెందిన వారే అన్నారు. వారు కల్వకుర్తి బీఆర్‌ఎస్ టికెట్ గురించి మాట్లాడటం, అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఈ సమావేశానికి హాజరవ్వడమే ఇతర పార్టీలకు చెందిన వారు సమావేశం ఏర్పాటు చేశారని అనడానికి నిదర్శనమన్నారు. 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పోటీ చేసినప్పుడు, ప్రస్తుత నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ ఆనాడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకులంతా ఇతర పార్టీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. పార్టీ వ్యతిరేకులు ఎమ్మెల్యేను ఏ అధికారంతో ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమ్మతి నేతల్లారా ఖబడ్దార్.. అధిష్టానం తగు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హయాంలోనే రూ.300 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఇక్కడ జైపాల్‌యాదవ్ గెలుపొందడం, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, వెంకటయ్య, రాములు, యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, హరిమోహన్‌రెడ్డి, కుమార్, మధు, జంగయ్య, పాండు, శ్రీశైలం, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగలకు రిమాండ్

రూ.4లక్షల విలువైన 10 వాహనాలు స్వాధీనం

పహాడీషరీఫ్: బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన పది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పహాడీషరీఫ్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో ఏసీపీ బి.శ్రీనివాస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన డెలివరీ బాయ్ మహ్మద్ అబ్దుల్ జుబేర్(22), మెడికల్ షాప్‌లో పనిచేసే శాస్త్రీపురం నివాసి మహ్మద్ పర్వేజ్ అహ్మద్(25), కాలాపత్తర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ మహ్మద్ హుస్సేన్(22), ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసే గోల్కొండకు చెందిన సయ్యద్ వాజిద్ అలీ(26) వ్యసనాలకు బానిసలయ్యారు. వచ్చే వేతనాలు వారి ఖర్చులకు సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌లను చోరీలు చేయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు రూ.4లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో పహాడీషరీఫ్ క్రైం టీం తీగలకుంటలో మాటు వేయడంతో నిందితులు చిక్కారు. వారిని విచారించగా పహాడీషరీఫ్, జవహర్‌నగర్, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, సనత్‌నగర్, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు చేసినట్లు అంగీకరించారు. ఈ సమావేశంలో డీఐ బి.సత్యనారాయణ, డీ ఎస్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాలతో పట్టుబడిన నిందితులు

పేలుడు కేసులో ఇద్దరికి..

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో బ్లాస్టింగ్ మెటీరియల్ పేలుడుకు కారకులైన ఇద్దరు వ్యక్తులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం .. గ్రామంలో ఈ నెల 28న యూజీడీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్, బ్లాస్టింగ్ పనులు చేసే వర్కర్ బ్లాస్టింగ్ మెటీరియల్‌ను నిర్లక్ష్యంగా వదిలేసి వెళ్లారు. ప్రమాదవశాత్తు పేలుడు సంభవించి ఇద్దరు వ్యక్తులు గాయపడగా పలువురి ఇళ్లు దెబ్బతిన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్ సాయిబాబా, బ్లాస్టింగ్ వర్కర్ అశోక్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, డీఈఓ, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ... పేదల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వైద్యులు పీహెచ్‌ఎస్‌లో నిత్యం అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వారికి టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం అందజేసే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. ప్రతీ బుధ, శనివారం ఏడాది లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకా వేయించాలన్నారు. గ్రామాల్లో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేయాలని సూచించారు. ప్రజలకు పౌష్టికాహారం, ఆహారపు అలవాట్లు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్‌లో షార్ట్‌సర్క్యూట్

తుర్కయంజాల్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఫంక్షన్ హాల్‌లో మంటలు చెలరేగి ఫర్నీచర్ దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కమ్మగూడలోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. ఫైర్‌ఇంజన్ సాయంతో మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.30లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని సమాచారం.

రెండు టిప్పర్లు సీజ్

కొత్తూరు: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసిన పోలీసులు ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేశారు. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సిద్ధాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు వీఆర్‌ఏ శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గ్రామానికి చెందిన పూర్ణచందర్, వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం

ఆమనగల్లు: పట్టణానికి చెందిన సాధు రాంబాబు మూడు రోజులుగా కనిపించడం లేదు. ఆమనగల్లు ఎస్ఐ బలరాం తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట మండలం జగ్‌బోయిన్‌పల్లికి చెందిన కవితకు శ్రీకాకుళం జిల్లా గజపతినగరానికి చెందిన సాధు రాంబాబుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరు పట్టణంలోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటూ స్థానికంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న తనకు నైట్ డ్యూటీ ఉందని భార్యను పుట్టింటికి వెళ్లమన్నాడు. తిరిగి 27న భార్య వచ్చిచూడగా రాంబాబు కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించింది. కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్లం, పటిక పట్టివేత

కడ్తాల్: అక్రమంగా తరలిస్తున్న బెల్లం పౌడర్, పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాయక్ తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన కోటయ్య హైదరాబాద్ నుంచి బెల్లం పౌడర్, పటికను ఆటోలో తరలించి కల్వకుర్తి, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో అక్రమంగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం ఉదయం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై కర్కల్‌పహాడ్ రాంనుంత గ్రామాల సమీపంలో ఆమనగల్లు ఎక్సైజ్ సిబ్బంది, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు చేపట్టి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 200 కేజీల బెల్లం పౌడర్, 100 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. కోటయ్యను అరెస్ట్ చేసి ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు యాదయ్య, స్వప్న, హెడ్ కానిస్టేబుల్స్ శంకర్, ఈసీ నర్సింహ ఉన్నారు.



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం పౌడర్, పటిక, ఆటో

చేవెళ్ల టికెట్‌పై సీఎం పునరాలోచించాలి

- ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు, నవాబుపేట బీఆర్‌ఎస్ నాయకులు
- కేఎస్ రత్నంకు కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



సమావేశంలో పాల్గొన్న నవాబుపేట బీఆర్‌ఎస్ నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థిత్వంపై సీఎం కేసీఆర్ పునరాలోచించాలని నవాబుపేట బీఆర్‌ఎస్ నాయకులు, ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు కోరారు. ఈ మేరకు వారు చేవెళ్ల మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలె యాదయ్యకే మళ్లీ టికెట్ కేటాయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. యాదయ్యపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. సర్వేలను మాత్రమే కాకుండా కింది స్థాయిలోనూ ఆయన గురించి తెలుసుకోవాలని కోరారు. నవాబుపేట మండలం నుంచి పార్టీకోసం పని చేస్తున్న ప్రజాప్రతినిధులకు నేటికీ ఎలాంటి గుర్తింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తమను పట్టించుకోకపోగా ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించారని ఆవేదన వెళ్లిబుచ్చారు. దళిత బంధు, బీసీ బంధుకు డబ్బులు వసూలు చేయడంతో పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. పార్టీ పదవులన్నీ తన కుటుంబానికే ఇచ్చుకుంటే పార్టీని నమ్ముకున్న ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దళితులను రాజకీయంగా అనగదొక్కుతున్నారని మండిపడ్డారు. పార్టీ నాయకుల వద్దే డబ్బులు వసూలు చేసి ఎంపీటీసీ టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో తమతో పాటు దళితులంతా ఆయనకు మద్దతిచ్చేది లేదని చెప్పారు. పార్టీ టికెట్‌పై అధిష్టానం పునరాలోచించి కేఎస్ రత్నంకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈసమావేశంలో నవాబుపేట వైస్ ఎంపీపీ బందయ్య, ఏఎంసీ డైరెక్టర్లు రాములు, జి.గోపాల్, కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్‌గౌస్, సాయిలు, మాజీ సర్పంచ్‌లు గోపాల్, జైపాల్‌రెడ్డి, పెంటయ్య, బి.గాలయ్య, నాయకులు అశోక్, ఎం.డీ బషీర్, రవీందర్, శేఖర్, లక్ష్మీన్ పాల్గొన్నారు.